క్లుప్తంగా...

సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బదిలీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జగన్ బదిలీ అయ్యారు. మూసారాంబాగ్ సర్కిల్‌కు చెందిన రవికుమార్‌ను రాజేంద్రనగర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో నగరంలోని జీహెచ్ఎంసీ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్‌లను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021 జనవరిలో జగన్ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పూర్తిస్థాయిలో ఇక్కడే విధులు చేపట్టారు.

చెరువులా రహదారి

వాహనాల రాకపోకలకు ఇబ్బందులు



మండలంలోని కవేలిగూడ చౌరస్తాలో రహదారిపై నిలిచిన నీరు

శంషాబాద్ రూరల్ : చిన్నపాటి వర్షానికి రహదారి చెరువులా మారింది.. రోడ్డుపై భారీగా వరదనీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శంషాబాద్–షాబాద్ రహదారిపై కవేలిగూడ చౌరస్తాలో తరచూ వర్షపు నీరు నిలబడుతోంది. మంగళవారం కురిసిన జల్లులకు వరదనీటితో రోడ్డు చెరువును తలపిస్తుంది.

సంగీతం .: ఓ వరం

సింగర్ అరుణ్ కౌండిన్య

సాక్షి, సిటీబ్యూరో: ఉన్నత భవిష్యత్‌కు కళాప్రతిభ బాటలు వేస్తుందని సంగీత ప్రతిభ ఓ వరం లాంటిదని ప్రముఖ గాయకుడు అరుణ్ కౌండిన్య అన్నారు. సంగీత శిక్షణ అందించే ముజిగల్ అకాడమీని మణికొండలో ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగీత అభ్యాసం కోసం పిల్లలను ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులు అభినందనీయులన్నారు. చిన్నారులపై సంగీతం సానుకూల ప్రభావం చూపిస్తుందన్నారు. ముజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఏలూరి మాట్లాడుతూ పియానో, కీబోర్డ్, గిటార్, డ్రమ్స్, కర్నాటిక్ ఒకల్స్, హిందుస్తానీ ఒకల్స్ , వెస్ట్రన్ ఒకల్స్‌లో శిక్షణ అందిస్తామని తమను తాము పరీక్షించుకునేందుకు వీలుగా నెల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు.

బోనాల చెక్కులు అందజేత



ఆలయాల కమిటీ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: భవిష్యత్ తరాలకు మన సంస్కృతి, సాంప్రదాయాలను చాటి చెప్పేలా పండుగలను నిర్వహించుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 56 దేవాలయాలకు బోనాల ఉత్సవాలకు అయిన ఖర్చు రూ.16 లక్షల విలువైన చెక్కులను ఆయా ఆలయాల కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వనం శ్రీరామ్‌రెడ్డి, పలుగుచెరువు మహేష్, రగడంపల్లి శ్రావణ్, పెండ్యాల సాయి మాలిక్, విజయ్‌కుమార్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, రాజేంద్రనగర్ డివిజన్‌లలోని నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్లకోమా కంటి పరీక్షల కేంద్రం ప్రారంభం



కంటి పరీక్ష చేస్తున్న వైద్య బృందం

రాజేంద్రనగర్: స్వచ్ఛంద సంస్థ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో పేద ప్రజలకు ఉచితంగా గ్లకోమా కంటి పరీక్షల కేంద్రాన్ని నిర్వహించారు. ఎస్ఈఈడీ–యూఎస్ఏతో కలిసి నగరానికి చెందిన ఆరోగ్య సంరక్షణ స్వచ్ఛంద సంస్థ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, నగరంలో నడుపుతున్న ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలలో ఒకటైన రాజేంద్రనగర్‌లోని వాదే ఈ మహమూద్‌లో ఉన్న మసీదులతో మొదటిసారి గ్లకోమా సమస్యకు సంబంధించి ఉచిత కంటి పరీక్షలను ప్రారంభించింది. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు.

మేస్త్రీ అదృశ్యం



అదృశ్యమైన రాజు

శంషాబాద్ రూరల్: పని కోసం ఇంటి నుంచి వెళ్లిన మేస్త్రీ అదృశ్యమయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలో టి.రాజు(30) మేస్త్రీ పని చేస్తుంటాడు. ఈ నెల 16న పని కోసం ఇంటి నుంచి బయలుదేరాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని భార్య విజయ మంగళవారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అమ్మవారి పూజలో పాల్గొన్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు



తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

బండ్లగూడలో ఎల్లమ్మతల్లి బోనాల జాతర

బండ్లగూడ: బండ్లగూడ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఊరేగింపుగా బోనాలు, తొట్టెలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు భూపాల్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అమ్మవారి పూజలో పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు పోరుబాట



కార్మిక సంఘాల జిల్లా సదస్సులో నేతలు

శంషాబాద్: కార్మికుల హక్కుల సాధనకు పోరుబాట కొనసాగుతుందని కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. కార్మికుల హక్కులను కేంద్ర సర్కారు తుంగలో తొక్కుతుందని మండిపడ్డారు.పట్టణంలోని వెంగమాంబ మినీహాలులో మంగళవారం కార్మిక సంఘాల జిల్లా సదస్సును ఏర్పాటు చేశారు. కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసుకునే సంఘాలను నిర్వీర్యంచేసే దిశగా కేంద్ర సర్కారు చట్టాలను రూపొందిస్తోందన్నారు. నిత్యావసర ధరలు ఆకాశానంటుతున్నా కార్మికుల వేతనాల్లో మార్పులు రావడం లేదన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 9, 10 తేదీల్లో మహా పడావు కార్యక్రమాన్ని నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు,ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్మిక సంఘాల నాయకులు యాదయ్య, చంద్రమోహన్, పద్మ మల్లేష్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

శంషాబాద్: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఆర్‌జీఐఏ ఎస్సై సుశీల సూచించారు. పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం ఇన్వెస్టిట్యూర్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై 'కెబినెట్'గా ఎంపికైన విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేశారు. ప్రిన్సిపాల్ తిరుపతి, ఇన్‌చార్జి మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాడ్జీలను ప్రదానం చేస్తున్న ఎస్సై సుశీల రవీంద్రభారతి పాఠశాలలో..



విద్యార్థులతో మేజర్ సర్విజిత్‌సింగ్

రాజేంద్రనగర్: అత్తాపూర్ రవీంద్రభారతి పాఠశాలలో ఇన్‌వెస్టిట్యూర్ సెర్మనీ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేజర్ సర్విజిత్‌సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్కూల్ లీడర్లకు బ్యాడ్జీలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధ, మెహదీపట్నం డీన్ ప్రియమనిష్, అకాడమిక్ ఇన్‌చార్జీ పరమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన జర్మనీ బృందం



హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావును కలిసిన జర్మనీ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని జర్మనీ యూనివర్శిటీ ఆఫ్ గొట్టింగెన్ బృందం మంగళవారం సందర్శించింది. ఈ బృందంలో యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ హెడ్ డాక్టర్ తంజాఫాల్కోవ్‌స్కీ, ఇంటర్నేషనల్ డైరెక్టర్ నేత్ర బండారి, న్యూఢిల్లీలోని గొట్టింగెన్ ఇండియా ఆఫీస్ కంట్రీ హెడ్ డాక్టర్ ఎలిజబెత్ సాంగేట్‌లు ఉన్నారు. ఈ బృందం మొదట హెచ్‌సీయూలో వీసీ ప్రొఫెసర్ బీజేరావుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ రెండు విశ్వవిద్యాలయాల మధ్య సహకారాన్ని విస్తరించేందుకు దృష్టి సారిస్తామన్నారు. ఐఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘనశ్యామ్ కృష్ణ, ఆర్ అండ్ డీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ స్మరత్ ఎల్ సబత్ విశ్వవిద్యాలయ కార్యకలాపాలు, విద్య, పరిశోధన రంగాలలో వృద్ధి గురించి వారికి వివరించారు.



ఎస్సైలను సన్మానించిన మధుబన్ కాలనీ అధ్యక్షుడు డి.వి.కుమార్ తదితరులు

ఎస్సైలకు సన్మానం

రాజేంద్రనగర్: విధి నిర్వహణలో ప్రజలతో మమేకమై, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలను కాపాడుతూ అంకితభావంతో పని చేశామని ఎస్సైలు రాజశేఖర్‌రెడ్డి, శ్రీలతరెడ్డిలు తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ నుంచి గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లకు బదిలీ అవుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్‌లను మంగళవారం మధుబన్ కాలనీ, పద్మశాలిపురం బస్తీలకు చెందిన అధ్యక్షులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మధుబన్ కాలనీ అధ్యక్షుడు డి.వి.కుమార్, ప్రధాన కార్యదర్శి జీయం విజయ్‌కుమార్, పద్మశాలిపురం నాయకులు మసున వెంకటేష్, కె.ఎల్లప్ప, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

గచ్చిబౌలి: పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ వెస్ట్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి సూచించారు. మంగళవారం జోనల్ కార్యాలయంలో జడ్సీని ఎమ్మెల్యే కలిశారు. సమస్యల పరిష్కారం కోసం కొత్త ప్రతిపాదనలు రూపొందించి నిధులు మంజూరు చేయాలని కోరారు. వర్షా కాలంలో లోతట్టు ప్రాంతాలపై అధికారులు దృష్టిసారించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

యువకుడు అదృశ్యం



శంషాబాద్ రూరల్: సిమెంటు ఇటుకలు తయారు చేసే యువకుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మహ్మద్ అజీం పాల్మాకుల ప్రాంతంలో సిమెంటు ఇటుక, రింగు తయారీ యూనిట్ నడుపుతున్నాడు. ఇందులో పని చేసేందుకు రెండు నెలల కిందట ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహిల్(20) అనే యువకుడిని పనికి పెట్టుకున్నాడు. కూలీల కోసం అజీం ఈ నెల 1న ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి యూనిట్ వద్ద రాహిల్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ నివారణపై రేపు అవగాహన ర్యాలీ

చార్మినార్: జాతీయ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 20న తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గౌలిపురా జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ (టీసీసీ) రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, టీసీసీ పాతబస్తీ అధ్యక్షులు ఎస్.రామకృష్ణ శాస్త్రి తెలిపారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డి, తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ పాల్గొని ర్యాలీ ప్రారంభిస్తారన్నారు. ప్లాస్టిక్ వస్తువులు, బ్యాగ్‌లతో కలిగే అనర్థాలు, నివారణపై ప్రసంగిస్తారన్నారు. ఆయనతో పాటు ప్రముఖ విద్యావేత్త వి.ప్రభాకర్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సౌత్ డైరెక్టర్ లయన్ ప్రేమ్‌చంద్ మనోజ్ జైన్‌లు పాల్గొంటారన్నారు. 30 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణకై ర్యాలీలు, సదస్సుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యవంతులను చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త ప్రొ. పురుషోత్తంరెడ్డి, తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మహేశ్ అగర్వాల్‌ను సన్మానించనున్నామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల (అటానమస్)లో 2023–24 సంవత్సరానికి వివిధ విభాగాల్లో తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాలభాస్కర్ తెలిపారు. ఆంగ్లం –2, సంస్కృతం–1, బీబీఏ–2, బిజినెస్ ఎనలటిక్స్–1, డాటా సైన్స్–1, అప్లైడ్ న్యూట్రిషన్–1, అరబిక్–1, బీబీఏ రిటైల్–2, బీసీఏ–2, బయో టెక్నాలజీ–1, కంప్యూటర్ సైన్స్–6, ఎకనామిక్స్ ఆనర్స్–2, హిస్టరీ ఆనర్స్–2, పొలిటికల్ సైన్స్–2, స్టాటిస్టిక్స్–1, టాక్సేషన్–1, ఫారిన్ ట్రేడ్–1 పోస్టులకు గాను తగిన విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 24వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు కళాశాలలో అందజేయాలన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు హాజరు కావచ్చునని.. పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతో పాటు బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9032138442లో సంప్రదించాలన్నారు.

పండగకు ఇంటికొచ్చి..

పేడ కోసం వెళ్లి వివాహిత మృతి

శంషాబాద్: పండగ నిమిత్తం తల్లిగారింటికి వచ్చిన వివాహిత రైలు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన శంషాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. కాచిగూడ రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌లో నివాసముంటున్న యమున (23) బోనాల పండగ కోసం తొండుపల్లిలో ఉండే తల్లి ఇంటికి రెండురోజుల కిందట వచ్చింది. పండగ సమయంలో వాకిట్లో కల్లాపి చల్లేందుకని పేడ తెచ్చేందుకు పక్కనే ఉన్న రైల్వే పట్టాలు దాటి వెళ్లి పేడ తీసుకుని పట్టాలు దాటుతుండగా యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొనడంతో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

ఓటు హక్కుపై ప్రత్యేక అవగాహన

రాజేంద్రనగర్: ఓటు హక్కు గురించి ప్రజలకు వివరిస్తూ వారిలో అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ హరీష్ అన్నారు. మంగళవారం జిల్లాలోని రాజేంద్రనగర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జూన్ 12వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు ఎఫ్ఎల్‌సి నిర్వహించామన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మినహా, మహేశ్వరం, ఎల్‌బీనగర్, చేవెళ్ల, షాద్‌నగర్, కల్వకుర్తి, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు గుర్తించిన ఈవీఎంలను ప్రతి గ్రామానికి పంపించి ఈ నెల 20వ తేదీ నుంచి 90 రోజుల పాటు ఓటు హక్కు వినియోగంపై మొబైల్ వాహనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరీష్

పార్టీ శ్రేణులు తరలిరావాలి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: ఈ నెల 20న జరిగే బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ నేతలకు సూచించారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్ హాజరు కానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ తన్వీ, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్. గణేష్‌గుప్తా, మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు కౌన్సిలర్ మంగళవారం నోటు పుస్తకాలను అందించారు. ఓ వైపు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు రాక విద్యార్థుల సమయం వృథా అవుతుంది. ఆ విషయాన్ని తెలుసుకున్న కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి రూ.25వేలు తన స్వంత డబ్బుతో పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు రాగి జావ అందిస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి

కార్మికులకు సౌకర్యాలను కల్పిస్తాం



నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి

మణికొండ: మున్సిపల్ కార్మికులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖయాదగిరి అన్నారు. మంగళవారం వట్టినాగులపల్లిలో ఆమె కౌన్సిల్ బి. యాదమ్మతో కలిసి కార్మికులకు అవసరమైన సబ్బులు, నూనెలు, డ్రస్‌లు, టవల్‌లు తదితర వస్తువులను అందజేశారు. వార్డులను శుభ్రంగా ఉంచేందుకు మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజు పాల్గొన్నారు.

వానొస్తే.. బురదే

చినుకులకే చిత్తడవుతున్న రహదారులు



మార్తాండనగర్ బస్తీ నుంచి లింకురోడ్డుకు వెళ్లే దారి బురదమయం



కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బస్తీల నుంచి లింక్ రోడ్డుకు వెళ్లే రహదారి వర్షానికి చిత్తడిచిత్తడిగా మారింది. బస్తీలో ఈ రోడ్డు చాలా ముఖ్యమైంది. చిన్నపాటి వర్షానికే రోడ్డు బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఇటీవల నాలా విస్తరణ పనులు పూర్తయ్యాయి. నాలా పనుల్లో రోడ్డు గుంతలు పడడంతో బాటు అస్తవ్యస్తంగా మారింది. దీంతో రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో దోమలు ప్రబలి స్థానికులు విషజ్వరాల బారిన పడుతున్నారు. కనీస వసతులపై దృష్టి సారించాలని బస్తీవాసులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. ప్రధానంగా మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ రోడ్లు మంజీరా రోడ్డు, బొటానికల్ గార్డెన్‌కు వెళ్ళే లింకురోడ్డుకు కలుస్తుంది. చిన్నపాటి వర్షానికే రోడ్డు చిత్తడిగా మారుతోంది. రోడ్డుపై ఉన్న గుంతలలో డ్రైనేజీ నీరు చేరి పరిసరాలు దుర్గంధంగా మారాయి. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో ఈ రోడ్డులో వెళ్ళాలంటే గుంతల వల్ల ఏ ప్రమాదం జరుగుతుందో అని భయపడుతున్నారు. వెంటనే సీసీ రోడ్డు వేయాలని బస్తీవాసులు కోరుతున్నారు.

– హఫీజ్‌పేట్

ఇబ్బందులు పడుతున్నాం



మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బస్తీల నుంచి లింకురోడ్డుకు వచ్చే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. వర్షం వస్తే చాలు ఒక వైపు చెత్త, మరో వైపు బురదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు రోడ్డు వేయాలి.

–సూరిబాబు, మార్తాండనగర్

రోడ్డు పక్కన చెత్తాచెదారం

జ్వరాలు వస్తున్నాయి



నాలా విస్తరణ పనుల్లో రోడ్డు గుంతలమయంగా మారింది. మురుగు నీరు గుంతలలో నిల్వ ఉండడం వల్ల దోమలు ప్రబలి విష జ్వరాలు వస్తున్నాయి. వృద్ధులు రోడ్డుపైకి వెళ్ళాలంటే జంకుతున్నారు. ఫాగింగ్ చేయాలి.

–పార్థసారథి, ప్రేమ్‌నగర్



రోడ్లపై మురుగు